ముషీరాబాద్, అంబర్‌పేటలో భారీ వర్షం

రాంనగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. రాత్రి వేళల్లో ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో రహదారులు నిండిపోవడంతో ట్రాఫిక్ జామ్ నెలకొంది. దీంతో వాహనదారులు, పాదచారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆర్టీసీక్రాస్‌రోడ్స్, అశోక్‌నగర్ చౌరస్తా, రాంనగర్ చౌరస్తా, ముషీరాబాద్ చౌరస్తా తదితర ప్రాంతాలలో వర్షం నీరు నిలిచిపోయింది. అంబర్‌పేట నియోజకవర్గంలోని అలీకేఫ్ చౌరస్తా, శ్రీరమణ చౌరస్తా, తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి, నింబోలిఅడ్డ, కాచిగూడ చౌరస్తా తదితర ప్రాంతాలలో వరదనీటితో జలమయంగా మారాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎట్టకేలకు జీహెచ్ఎంసీ ఎమర్జెన్సీ అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగి పలు కూడలి ప్రాంతాలలో వర్షం నీరు సాఫీగా వెళ్లేలా చేస్తూ వాహనాల రాకపోకల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

అన్నార్తుల కడుపు నింపుతున్న అన్నదానం

చిక్కడపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): అన్నదాన కార్యక్రమాలు అన్నార్తుల కడుపు నింపుతున్నాయని చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్ అన్నారు. అన్నదానం చేయడం అంటే అది దైవకార్యంతో సమానమన్నారు. చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయం గేట్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన చేపూరి లక్ష్మణ్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం కార్యక్రమంలో నిరుద్యోగ యువత, పోటీపరీక్షల అభ్యర్థులకు కూడా భోజన సదుపాయం కల్పించామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధానకార్యదర్శి పల్లెర్ల రమేష్, కోశాధికారి తొడుపునూరి రవీందర్, మాజీ అధ్యక్షుడు సింగారపు రమేష్, సురేందర్‌గుప్త, గంప భిక్షపతి, ప్రసాద్‌రావు, బాలకుమార్ పాల్గొన్నారు.

అన్నదానానికి దాతలు సహకరించాలి

చిక్కడపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లి శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో ప్రతి గురువారం మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ వైస్‌చైర్మన్ పెద్దోల్ల గంగారెడ్డి, ప్రధానకార్యదర్శి ఎన్.ధర్మరాజుగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతలు వస్తు, ధన రూపేణా సహకరించాలని వారు కోరారు.

కులవృత్తిపై ఆధారపడిన వడ్డెర్లను ఆదుకోవాలి

చిక్కడపల్లి: కులవృత్తిపై ఆధారపడిన వడ్డెర్లను ప్రభుత్వం ఆదుకోవాలని వడ్డెర సంఘం తెలంగాణ గన్నుదెబ్బ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన చిక్కడపల్లిలో మాట్లాడారు. గతంలో వచ్చిన జీవోలను అమలు చేస్తూ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. సంఘం ముఖ్య సలహాదారు డా.ఓర్సు కృష్ణయ్య పాల్గొన్నారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

చిక్కడపల్లి: రాష్ట్రవ్యాప్తంగా బకాయి ఉన్న 20 లక్షల మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. చిక్కడపల్లిలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.6వేల కోట్లకు పైగా అన్ని కాలేజీలకు విద్యార్థుల ఫీజు బకాయిలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, మెడిసిన్, బీఫార్మసీ, ఎంబీబీఎస్ కోర్సులు చదువుతూ కోర్సు పూర్తయిన వారికి సర్టిఫికెట్లు కొన్ని కాలేజీ యాజమాన్యాలు ఇవ్వడంలేదన్నారు. ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ హైదరాబాద్ ప్రధానకార్యదర్శి క్రాంతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యవ్వనస్థుల కూటములు ప్రారంభం

చిక్కడపల్లి,మే 27(ఆంధ్రజ్యోతి): గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్‌చర్చిలో యవ్వనస్థుల కూటములు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చర్చిని ముస్తాబు చేశారు. దేశవ్యాప్తంగా 10వేలమంది యువతీయువకులు ఆరు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉందని చర్చి నిర్వాహకులు భావిస్తున్నారు. చర్చి లోపలిభాగంలో ప్రతి నిత్యం వేలాది మందికి టిఫిన్, లంచ్, డిన్నర్ కోసం వంటలు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా చర్చి స్థానిక దైవసేవకులు జోసెఫ్ పి.కురియన్, చర్చి సొసైటీ చైర్మన్ జాన్ సుందరం, దైవసేవకులు ఎం. ఇమ్మాన్యుయేల్, డేవిడ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ముషీరాబాద్‌లో ప్యాచ్‌వర్క్ పనులు

ముషీరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని గంగపుత్రకాలనీ కళాధర్‌నగర్‌లో అధ్వానస్థితికి చేరుకున్న రోడ్లను మంగళవారం జీహెచ్ఎంసీ సిబ్బంది పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడంతో స్థానిక బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూసగోరక్‌నాథ్, స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులను చేశారు.

అంబర్‌పేటలో భూగర్భ విద్యుత్ లైన్ల పరిశీలన

అంబర్‌పేట, మే 27 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లో చేపట్టిన భూగర్భ విద్యుత్ లైన్ పనులను మంగళవారం కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. భూగర్భ విద్యుత్ లైన్లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో విద్యుత్ శాఖ అధికారులు భూగర్భ విద్యుత్ కేబుల్ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ శీనయ్య, ఏఈ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌నగర్‌లో మంచినీటి సమస్య పరిష్కరిస్తాం

అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో స్థానికులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన ప్రేమ్‌నగర్‌లో స్థానికుల ఫిర్యాదు మేరకు మంచినీటి సమస్య ఉన్న ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలి

అంబర్‌పేట, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ కార్పొరేటర్ పులి జగన్ కోరారు. మంగళవారం అనారోగ్యంతో బాధపడుతున్న అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌కు చెందిన సరస్వతి, యాదగిరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు.

గోడకేసి కొట్టి.. ఆపై గొంతు నులిమి..

భర్తను హత్య చేసిన భార్య



సభావత్ కిషన్ నాయక్ (ఫైల్)

వనస్థలిపురం, మే 27(ఆంధ్రజ్యోతి): భర్తను గోడకేసి కొట్టి.. ఆపై గొంతు నులిమి హత్య చేసిందో మహిళ. అనంతరం ప్రమాదవశాత్తు చనిపోయాడని పోలీసులతో సహా అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వనస్థలిపురం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం భావత్ తండాకు చెందిన ఆటో డ్రైవర్ సభావత్ కిషన్ నాయక్(40)కు కళతో 2005లో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. మొదటి భార్య మృతి చెందడంతో పిల్లలు ముగ్గురూ అమ్మమ్మ వద్ద ఉంటున్నారు. కిషన్ నాయక్ నగరానికి వచ్చి ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇలా ఉండగా, యాదాద్రి - భవనగిరి జిల్లా గోకారం గ్రామానికి చెందిన శిరీషకు భర్తతో మనస్పర్థలు రావడంతో 2015లో విడాకులు తీసుకుంది. ఈమెకు కిషన్ నాయక్‌తో పరిచయం ఏర్పడటంతో 2015లో రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు, అమ్మమ్మ దగ్గర ఉంటున్నారు. భార్యాభర్తలు గ్రామంలో వ్యవసాయం చేసుకొనేవారు. ఈ క్రమంలో శిరీషకు మరోవ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం తెలుసుకున్న భర్త భార్యను మందలించడంతో గొడవలు జరిగేవి. 2 నెలల క్రితం వనస్థపురంలోని హిల్‌కాలనీకి మకాం మార్చారు. కిషన్‌నాయక్ సోమవారం సాయంత్రం మద్యం తాగి భార్య పనిచేసే చోటికి వెళ్లి ఆమెతో గొడవపడి ఇంటికి తీసుకొచ్చాడు. మరోసారి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తురాలైన శిరీష భర్తను గట్టిగా గోడకేసి కొట్టింది. తర్వాత గొంతు నులిమి హత్య చేసింది. అనంతరం అంబులెన్స్‌లో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లింది. కిషన్ నాయక్‌కు పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఇలా ఉండగా, కిషన్‌నాయక్ మొదటి భార్య కూతురు బిందు తన తండ్రిని శిరీష చున్నీతో హత్య చేసిందని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు శిరీషపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తెలంగాణ ఉద్యమకారులు



ధర్నాలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ చెరుకు సుధాకర్ తదితరులు

కవాడిగూడ, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించి తగిన న్యాయం చేయాలని పలువురు తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఉద్యమకారుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నిరాహార దీక్షకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు పెద్దసంఖ్యలో హాజరై తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ చెరుకు సుధాకర్, గద్దర్ తనయుడు సూర్యం, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ ప్రఫుల్‌రాంరెడ్డి, ప్రధానకార్యదర్శి బత్తుల సోమయ్య, క్రిస్టోఫర్, వైస్‌చైర్మన్ తుల్జారెడ్డి, అన్వర్‌పటేల్, గోకపద్మ, బుజ్జి, మహిళా అధ్యక్షురాలు కోతి మాధవి, ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి, 200 గజాల ఇంటి స్థలంతో పాటు నాలుగు గదుల ఇళ్లను నిర్మించి ఇవ్వాలని అన్నారు. తెలంగాణ ఉద్యమ కారులకు రూ.30వేల గౌరవవేతనాన్ని ప్రతినెలా చెల్లించాలని డిమాండ్ చేశారు. మలిదశ ఉద్యమంలో అమరులైన 1200 మందిలో గత ప్రభుత్వం గత కొంత మందికి సహాయం చేసి, మిగతా వారిని విస్మరించారని వారు ఆరోపించారు. వంద ఎకరాలలో అమరుల స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని, తదితర డిమాండ్లను నెరవేర్చాలని అన్నారు.



ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు, నాయకులు

మోదీ నాయకత్వంలో దేశానికి ప్రత్యేక గుర్తింపు

- రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

రాంనగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశానికి ప్రపంచస్థాయిలో ప్రత్యేకగుర్తింపు లభిస్తుందని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు ఆస్ట్రేలియాలో జరిగిన ఏషియా పసిఫిక్ రీజనల్ కాన్ఫరెన్స్ సమావేశాలకు భారతదేశ ప్రతినిధిగా పాల్గొని నగరానికి డా.కె.లక్ష్మణ్ వచ్చారు. దీంతో మంగళవారం బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని పార్టీ కార్యాలయంలో లక్ష్మణ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారత్ ముందు వరుసలో ఉందన్నారు. భరత్‌గౌడ్ మాట్లాడుతూ సిందూర్ ఆపరేషన్ విజయంతో దేశప్రతిష్ట మరింత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆర్.శేషసాయి, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్, నగర నాయకులు జి.వెంకటేష్, కిరణ్, ఆయూష్ తదితరులు పాల్గొన్నారు.

గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులు 'ఈశ్రమ్'లో పేర్లు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న డీసీఎల్ బి.జాసన్

చిక్కడపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులు తమ పేర్లను ఈశ్రమ్ పథకంలో నమోదు చేసుకోవాలని హైదరాబాద్ డిప్యూటీ లేబర్ కమిషనర్ బి.జాసన్ సూచించారు. గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల పేర్ల నమోదు కోసం వారంరోజులపాటు నిర్వహించే ప్రత్యేక డ్రైవ్‌ను ఆయన మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్ లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంరోజులపాటు జరిగే స్పెషల్‌డ్రైవ్‌లో గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులు అందరూ వారి ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌ను తెచ్చుకుని కార్మికశాఖ అధికారి(లేబర్ ఆఫీసర్) వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవచ్చునన్నారు. నగరంలో ఉన్న జొమాటో, స్విగ్గీ, ఊబర్, ఓలా అన్ని ప్లాట్‌ఫామ్‌లలో పనిచేస్తున్న కార్మికులు అందరూ ఈశ్రమ్ పథకంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి జొమాటో, స్విగ్గీ, ఊబర్, ఓలా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని డీసీఎల్ బి.జాసన్ కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎల్ శ్రీనివాస్ గౌడ్, హైదరాబాద్ ఏఎల్‌వోలు పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభిస్తున్న రాంనగర్ వాసవీ సేవా సమితి కన్వీనర్ రాజశేఖర్‌గుప్తా, అధ్యక్షుడు వాడకట్టు రాజు తదితరులు

రాంనగర్ 'వాసవి' సేవలు స్ఫూర్తిదాయం

రాంనగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో రాంనగర్ వాసవీ సేవాసమితి స్ఫూర్తిదాయం అని రాంనగర్ వాసవీ సేవా సమితి కన్వీనర్ కె.రాజశేఖర్‌గుప్తా పేర్కొన్నారు. అమావాస్యను పురస్కరించుకుని రాంనగర్ వాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం రాంనగర్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2012 నుంచి రాంనగర్ వాసవీ సేవా సమితి తరపున ప్రతి నెలా అమావాస్య రోజు 500 మందికి అన్నదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి రాంనగర్ శాఖ అధ్యక్షుడు వాడకట్టు రాజు, ప్రధానకార్యదర్శి చల్లా శివకుమార్, సలహాదారుడు బుక్క రమేష్, కోశాధికారి గంజి శ్రీనివాస్, సభ్యులు ఆంజనేయులు, పోకల రాజేందర్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి సునీల్ సంస్మరణ సభ

నల్లకుంట, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్)రాష్ట్ర కోశాధికారి, వైష్ణవ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మంత్రి సునీల్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన నేపథ్యంలో బుధవారం నల్లకుంటలోని సమితి కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎస్, వైష్ణవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, ప్రతినిధులు పాల్గొని మంత్రి సునీల్ ఆత్మశాంతికి నివాళులర్పించాలని ఆయన కోరారు.

నేడు సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

నల్లకుంట, మే 27 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నేతృత్వంలో నల్లకుంట డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీల్లో మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణంతో పాటు సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు డివిజన్‌లోని నర్సింహబస్తీలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని ఆయన తెలిపారు. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొనే ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

దేశరక్షణకోసం ప్రతి పౌరుడూ సైనికుల్లా మారాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

చిక్కడపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో ప్రతి పౌరుడు కూడా సైనికుల్లా మారాల్సిన అవసరం ఉందని ఇండియన్ యోగా అసోసియేషన్ కోఆర్డినేటర్ పతంజలి శ్రీనివాస్ అన్నారు. ప్రణవ సంకల్ప యోగా సమితి(పీఎస్‌వైఎస్) ఆధ్వర్యంలో గత నెల ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో మహాసూర్య వందనం-2025 పేరిట 22 వేల మంది గిరిజన విద్యార్థులతో 108 పర్యాయాలు సూర్య నమస్కారాలు 108 నిముషాల్లో పతంజలి శ్రీనివాస్ పర్యవేక్షణలో చేయించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం చిక్కడపల్లిలో పీఎస్‌వైఎస్ సభ్యురాలు డి.మీనాక్షిదేవి పర్యవేక్షణలో అరకు రికార్డు కార్యక్రమంలో పాల్గొన్న యోగా శిక్షకులు, సాధకులకు రికార్డు ప్రశంసాపత్రాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన పతంజలి శ్రీనివాస్ మాట్లాడుతూ సైనికులు అంటే కేవలం సరిహద్దులో పనిచేస్తున్న వారు మాత్రమే కాదు ప్రతి పౌరుడు కూడా ఒక సైనికుడిలామారాలని, అది యోగా ద్వారా సాధ్యమవుతుందన్నారు. మాజీ సైనికాధికారి మేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలో నాలుగో అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వొకేట్ సి.రఘు, నాగచంద్రికదేవి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీఆర్ఎస్ దారిలో కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) నేతల డిమాండ్



మాట్లాడుతున్న పీవైఎల్ నేతలు కేఎస్.ప్రదీప్, అజయ్ తదితరులు

నల్లకుంట, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో నిరుద్యోగులకు రూ.4 వేల భృతి కల్పిస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి అమలు చేయడంలో విఫలమైందని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్.ప్రదీప్, వి.అజయ్ ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి కల్పించడంలో కాలయాపన చేసిందని విమర్శించారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పీవైఎల్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని పదేళ్ల హయాంలో ఇవ్వలేదని ఆరోపించారు. ఆ ప్రభుత్వాన్ని విమర్శించిన కాంగ్రెస్ ప్రభుత్వం అదే దారిలో నడుస్తుందని ఆరోపించారు. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించినా ఉద్యోగాలు మాత్రం భర్తీ చేయడం లేదన్నారు. జూన్ 2వ తేదీ నాటికి నిరుద్యోగ భృతిపై స్పష్టమైన ప్రకటన చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు ఈశ్వర్, ఎం.రవికుమార్, ప్రతాప్, ఎన్.వి.రాకేష్, భరత్, కృష్ణ, దేవ, నవీన్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో ఎమ్మెల్యే పాదయాత్ర

గోల్నాక, మే 27 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్‌లోని శ్యామ్‌నగర్, సుందర్‌నగర్ బస్తీలలో మంగళవారం విస్తృతంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాదయాత్ర చేసి, ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. బస్తీల్లో సమస్యలన్నింటినీ అంచలంచెలుగా పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా నియోజకవర్గంలోని అందరినీ కలుపుకుని అభివృద్ధియే లక్ష్యంగా, ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నానని అన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

బర్కత్‌పుర, మే 27 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నింబోలిఅడ్డ శ్రీమహంకాళి ఆలయ ధర్మకర్త రాజేందర్ పటేల్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలతోనే పర్యావరణం, పచ్చదనం నిండుగా ఉంటుందన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణకు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



బిజ్జి శత్రును సన్మానించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ముషీరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌కు చెందిన ఆలిండియా ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి ముషీరాబాద్‌లో చేపడుతున్న పార్టీ కార్యక్రమాల వివరాలు, ప్రజా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. అర్హులైన ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి నామినేటెడ్ పోస్టులు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా బిజ్జి శత్రును ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్మానించారు.



ఎంసీహెచ్ కాలనీలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులు

రోడ్డు పనుల్లో నాణ్యత ఉండాలి : కార్పొరేటర్

ముషీరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ ఎంసీహెచ్ కాలనీలో రూ.8లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఎంసీహెచ్ కాలనీలో ప్రారంభించిన రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... త్వరితగతిన రోడ్డు పనులు పూర్తిచేసి ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణాలకు వెంటనే నిధులు విడుదల చేసి, పనులు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ, ఎంసీహెచ్ కాలనీ అధ్యక్షుడు అనంత కుమార్, తులసీ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మందగమనం

- అన్ని రంగాల్లో భారత్ పురోగతి
- కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్



ప్రసంగిస్తున్న డాక్టర్ అనంత నాగేశ్వరన్

రాయదుర్గం, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మందగమనం కొనసాగుతుంటే భారత్ అన్ని రంగాల్లో స్థిరమైన పురోగతి సాధిస్తుందని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి.అనంత నాగేశ్వరన్ అన్నారు. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ, జాతీయ గణాంకాల కార్యాలయం, ఐఎస్‌బీ, ఇన్‌కార్పొరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తాధ్వర్యంలో 2023-24 వార్షిక సర్వే డేటా ఫలితాలపై మంగళవారం ఐఎస్‌బీలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. తయారీ రంగంలో పటిష్టమైన మూల ధన వ్యయంతో సంస్థలు, మహిళా వ్యవస్థాపక వృద్ధిలో పురోగతి సాధిస్తుందన్నారు. ఇన్ కార్పొరేటేడ్, వ్యవసాయేతర రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధిస్తున్నామని ఈ సర్వే గణాంకాల డేటా వెల్లడిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న అనిశ్చితి యుగంలో భారత ప్రభుత్వ విధాన పరమైన సంస్కరణలు రూపొందించటానికి ఇటువంటి వివరణాత్మకమైన డేటా ఎంతో కీలకంగా మారుతుందన్నారు. గణాంక కార్యక్రమాల కార్యదర్శి డాక్టర్ సౌరబ్‌గార్గ్ మాట్లాడుతూ, ప్రభుత్వం పటిష్టమైన పురోగతికి అన్ని రంగాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించిన గణాంకాల డేటా భవిష్యత్తులో ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ డేటాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- తెలంగాణ ఆటో డ్రైవర్ల జేఏసీ నేతల డిమాండ్

కవాడిగూడ, మే 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆటో యూనియన్ జేఏసీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఆటో రథయాత్ర ముగింపు సందర్భంగా మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఆటో కార్మికుల 'ఆకలి కేకల' సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, అధ్యక్షుడు మంద రవికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇస్తామన్న సంవత్సరానికి రూ.12వేల భృతిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఓలా, ఊబర్ రాపిడో సంస్థ ద్వారా నడుస్తున్న టూ వీలర్స్ సర్వీసులను వెంటనే నిషేధించాలని వారు తెలిపారు. గ్రేటర్ పరిధిలో ఆటోమీటర్ల చార్జీలు పెంచాలన్నారు. ఆటో కార్మికుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని నేతలు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని లేకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని జేఏసీ నేతలు హెచ్చరించారు.

రేపు పాఠశాల విద్యార్థుల సురక్షిత రవాణాపై సమావేశం

ముషీరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల నుంచి విద్యార్థుల సురక్షిత రవాణా కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై ఈనెల 29న ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఉదయం 9గంటలకు సమావేశం నిర్వహిస్తున్నామని తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎన్ రెడ్డి, అనిల్ కుమార్‌లు తెలిపారు. మంగళవారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... సమావేశానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ట్రస్మా కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31న సూపర్ స్టార్ కృష్ణ సూపర్ అవార్డ్స్ 2025 ప్రదానం

బర్కత్‌పుర, మే 27 (ఆంధ్రజ్యోతి): ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 31న సూపర్‌స్టార్ కృష్ణ సూపర్ అవార్డ్స్ 2025 ప్రదానం చేస్తున్నట్లు ఎఫ్‌టీపీసీ తెలంగాణ రాష్ట్ర మీడియా చైర్మన్ కిరణ్ బేజాడి తెలిపారు. మంగళవారం కాచిగూడలో జరిగిన కార్యక్రమంలో అవార్డు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 31న సాయంత్రం 6 గంటలకు ఎల్వీ ప్రసాద్ ల్యాబ్‌లో ఈ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. సినిమా, సాంకేతిక, సామాజిక సేవ, హెల్త్ కేర్ తదితర రంగాలలో సేవలందించిన వారికి ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో వెంకటేష్, జనరల్ మేనేజర్ ప్రజ్వల, చందు పాల్గొన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూకు నివాళి

నల్లకుంట, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామిక ప్రగతిశీ భారతావనికి పునాది వేసిన తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అని కాంగ్రెస్ పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు జి.లక్ష్మణ్ పేర్కొన్నారు. మంగళవారం జవహర్‌లాల్‌నెహ్రూ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఆబిడ్స్‌లో ఆయన విగ్రహానికి జి.లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.శ్రీకాంత్, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
అంజిరెడ్డి : 99859 21362